RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in rajadhanivoicedaily@gmail.com




సంపుటి : 02 | సంచిక : 312 | 03 శనివారం అక్టోబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## నన్ను మీ ఆంధ్ర బిడ్డగా భావించండి : అనంత్ అంబానీ



**మదనపల్లె, రాజధాని వాయిస్ :** రాయలసీమ ఉద్యానహబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ)లో రిలయన్స్ భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ అన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఉద్యాన హబ్, ఐఏఎస్ఏ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంత్ అంబానీ మాట్లాడుతూ.. ఈ చరిత్రాత్మక కార్యక్రమంలో భాగస్వామ్యం కల్పించి రిలయన్స్‌పై నమ్మకం ఉంచినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఐఏఎస్ఏకు తమ సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. తనను ఆంధ్ర బిడ్డగా భావించాలని.. రాష్ట్రానికి అందించాల్సిన సహకారంపై మార్గనిర్దేశం చేయాలని సీఎం చంద్రబాబును అనంత్ అంబానీ కోరారు. ప్రసంగం అనంతరం ఆయన్ను నిర్మలా సీతారామన్, చంద్రబాబు అభినందించారు.

## ఫ్రూట్‌బౌల్ ఆఫ్ వరల్డ్‌గా రాయలసీమ

- చంద్రబాబు, నిర్మలా సీతారామన్‌ల ప్రకటన
- ఆంధ్ర బిడ్డగా భావించండి : అనంత్ అంబానీ
- రాయలసీమ ఉద్యాన హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన



**మదనపల్లె, రాజధాని వాయిస్ :** రాయలసీమను ఫ్రూట్ బౌల్ ఆఫ్ వరల్డ్ గా మారుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రూ. లక్ష కోట్లతో రాయలసీమ ఉద్యాన హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ)కు శుక్రవారం వారు శంకుస్థాపన చేశారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్య ఆలోచనలను వాస్తవం చేస్తూ కరువు సీమలో రూ.లక్ష కోట్లతో రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు శ్రీకారం చుట్టామన్నారు. దీంతో 201 క్లస్టర్లు, 303 మండలాల్లో 5,869 గ్రామాలు ప్రయోజనం పొందుతాయని చెప్పారు. 37,50,000 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగుతో పది లక్షల మంది రైతులకు, 49 లక్షల మంది ప్రజలకు ఉపాధి లభించనుందన్నారు. రాయలసీమలో ఆపిల్ నుంచి అవకాడో వరకూ 20 రకాల పంటలు పండుతాయని, ఇన్ని రకాల పంటలు పండే ప్రాంతం ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. ప్రాసెసింగ్ ద్వారా స్థిరమైన ఆదాయం లభిస్తుందని, భవిష్యత్తులో రాయలసీమను కరువుసీమ నుంచి సిరుల సీమగా మారుస్తామన్నారు. రాయలసీమలో డిఫెన్స్, ఎయిర్‌పోర్టు, నాలుగు వరుసల రైల్వే లైన్ సదుపాయాలతో వరల్డ్ క్లాస్ లాజిస్టిక్స్‌తో ప్రపంచానికి అనుసంధానిస్తామన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ పేజ్-2, జిఎన్ఎస్ఎస్ ఫేస్-2, వేదవతి, భైరవానితిప్ప, అప్పర్ పెన్నార్, మల్లెమడుగు, బాలాజీ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ., మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతులను పురస్కరించుకుని హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు, కిసాన్ ఇన్సూరెన్స్ వంటి పథకాలు ప్రవేశపెట్టామన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, రాయలసీమను వాటర్ సెక్యూరిటీ రీజియన్ గా తీర్చిదిద్దుతామన్నారు. రాబోయే రోజుల్లో అభివృద్ధి, అవకాశాలకు నిలయంగా సీమ కొత్త చరిత్రను లిఖిస్తుందన్నారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, కడప జిల్లా నుంచి ప్రారంభించిన యువగళం పాదయాత్ర సందర్భంగా మిషన్ రాయలసీమ డిక్లరేషన్ లో హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని హామీ ఇచ్చానని, నేడు నెరవేర్చానని తెలిపారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... రూ.లక్ష కోట్లతో రాయలసీమ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సంస్థ ప్రారంభంతో రాయలసీమ దశ, దిశా మారబోతోందని తెలిపారు. దీని ద్వారా పది జిల్లాలో పండించిన పంటలకు మార్కెటింగ్ సదుపాయం అందుబాటులోకి రానుందన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ మాట్లాడుతూ... తనను ఆంధ్ర బిడ్డగా భావించాలని.. రాష్ట్రానికి అందించాల్సిన సహకారంపై మార్గనిర్దేశం చేయాలని చంద్రబాబును కోరారు. ?బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.విఎన్ మాధవ్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో దగాపడ్డ రాయలసీమ, కరువు సీమ వంటి పదాల స్థానంలో సిరులు గొలిపే రాయలసీమ వంటి పదాలు వినబోతారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రాయలసీమకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్ దిశగా అడుగులు



**మదనపల్లె, రాజధాని వాయిస్ :** కరవుతో గుర్తింపు పొందిన రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. మదనపల్లెలో రాయలసీమ సమగ్ర ఉద్యాన కేంద్రం, భారత వ్యవసాయ విద్యాలయానికి జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొన్న ఆయన రాయలసీమ అభివృద్ధిపై ప్రభుత్వ దృక్పథాన్ని వివరించారు. ఉద్యాన రంగంలో భారీ పెట్టుబడులతో రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో సమగ్ర ప్రణాళిక అమలు చేస్తున్నామని చెప్పారు. రైతు పొలం నుంచి అంతర్జాతీయ మార్కెట్ వరకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నామని వివరించారు. నిల్వ కేంద్రాలు, శీతల గిడ్డంగులు, విలువ ఆధారిత ఉత్పత్తి కేంద్రాలు, రవాణా సదుపాయాలను విస్తరించడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.రాయలసీమ చరిత్ర, సంస్కృతి, వ్యవసాయ సామర్థ్యాన్ని ప్రస్తావించిన పవన్ కళ్యాణ్ గతంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న ఈ ప్రాంతం ఇప్పుడు అభివృద్ధి దిశగా వేగంగా పయనిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సాగునీటి వనరులు, రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ప్రజల మద్దతుతో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతమయ్యాయని పేర్కొన్నారు. గత రెండేళ్లలో రాయలసీమలో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఉద్యాన పంటల సాగు విస్తరణ, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి హామీ నిధులతో నీటి సంరక్షణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రాజెక్ట్ జలధార ద్వారా భూగర్భ జలమట్టాలు గణనీయంగా పెరిగాయని, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతున్నాయని వివరించారు.రాయలసీమ రైతులు కొత్త పంటల సాగులో చూపుతున్న ఆసక్తి ప్రశంసనీయమని పవన్ కళ్యాణ్ అన్నారు. మామిడి, అరటి, టమాటా, దానిమ్మ వంటి సాంప్రదాయ ఉద్యాన పంటలతో పాటు డ్రాగన్ పండు, అవకాడో, యాపిల్ వంటి అధిక విలువ కలిగిన పంటలను కూడా సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. మదనపల్లె ప్రాంతం టమాటా ఉత్పత్తిలో ప్రత్యేక గుర్తింపు పొందిందని, ఈ ప్రాంతంలో ఉద్యాన రంగానికి అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రాయలసీమను కరువు ప్రాంతంగా కాకుండా సంపద సృష్టించే వ్యవసాయ కేంద్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతుల ఆదాయం పెరగడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం, వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లను అందుబాటులోకి తేవడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధిని సాధించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దేశంలో ఏపీని నెం.1గా నిలపడమే లక్ష్యం

**దశాబ్ద కాలంలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చగలం: మంత్రి నారా లోకేష్**



**విజయవాడ, రాజధాని వాయిస్ :** దేశంలో ఆంధ్రప్రదేశ్‌ను నెం.1గా నిలపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసర మని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో పాన్-ఐఐటీ కాన్ఫరెన్స్ టీమ్‌తో నిర్వహించిన డిన్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం పట్టుదలతో పనిచేస్తోందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో 50 శాతం మంది ఎమ్మెల్యేలు తొలిసారి ఎన్నికైనవారని, 25 మంది మంత్రుల్లో 17 మంది తొలిసారి మంత్రులుగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు. కొత్త ఆలోచనలు, సాంకేతికత, పెట్టుబడులతో ఏపీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. హార్టికల్చర్ నుంచి స్పేస్ వరకు, డ్రోన్ల నుంచి క్వాంటమ్ టెక్నాలజీ, డేటా సెంటర్ల వరకు వివిధ రంగాల్లో రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల భాగస్వామ్యంతో భారీ పెట్టుబడులకు అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. భారత్‌ను కేవలం దశాబ్ద కాలంలో అభివృద్ధి చెందిన దేశంగా మార్చగలమన్న విశ్వాసాన్ని లోకేష్ వ్యక్తం చేశారు. దేశంలోని ప్రతిభ, మేధోశక్తి, సంకల్పం, సానుకూల నాయకత్వాన్ని సమర్థంగా వినియోగిస్తే ఈ లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. పోటీతో కూడిన సమాఖ్య వ్యవస్థలో ఒక రాష్ట్రం సాధించిన విజయాలను ఇతర రాష్ట్రాలు అనుసరించే అవకాశం ఉందని, ఆంధ్రప్రదేశ్ ఈ మార్పునకు నాయకత్వం వహించాలని కోరుకుంటోందని చెప్పారు. అమరావతిని ప్రపంచస్థాయి రాజధాని నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశం గర్వపడేలా అమరావతిని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని పరిశీలిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ ఏమిటో స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. పాన్-ఐఐటీ సభ్యులు, దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీల డైరెక్టర్లు, పూర్వ విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కల్కి భగవాన్‌కు ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ వీడ్కోలు



**తిరుపతి, రాజధాని వాయిస్ :** ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, వన్‌నెస్ ఆధ్యాత్మిక సంస్థ వ్యవస్థాపకులు కల్కి భగవాన్ (విజయ్ కుమార్ నాయుడు) అంతిమ కార్యక్ర మాలు తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలం బత్తలవల్లంలోని ఏకం క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి అనం రామనారాయణరెడ్డి హాజరై కల్కి భగవాన్ పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రి అనం రామనారాయణరెడ్డి కల్కి భగవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక రంగంలో కల్కి భగవాన్ అందించిన సేవలను స్మరించుకున్నారు. మానవతా విలువలు, ఆధ్యాత్మిక చైతన్యం విస్తరణకు ఆయన చేసిన కృషి విశేషమని పేర్కొన్నారు. కల్కి భగవాన్ ఆలోచనలు, బోధనలు అనేక మందికి స్ఫూర్తినిచ్చాయని మంత్రి అన్నారు. సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు, మానవ సంబంధాలను బలోపేతం చేసేందుకు ఆయన నిరంతరం కృషి చేశారని తెలిపారు. ఆయన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆయన సేవలకు ప్రభుత్వం గౌరవం తెలిపిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఏకం క్షేత్రం పరిసరాల్లో భక్తులు, అనుచరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్కి భగవాన్‌కు తుదివీడ్కోలు పలికారు. ఆధ్యాత్మిక గురువును చివరిసారి దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు చేరుకున్నారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. కల్కి భగవాన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన మంత్రి అనం రామనారాయణరెడ్డి, వారి కుటుంబ సభ్యులకు, భక్తులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక రంగంలో ఆయన చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## అమరావతి ఓఆర్ఆర్‌కు టెండర్లు



**అమరావతి, రాజధాని వాయిస్ :** రాజధాని అమరావతి, విజయవాడ, గుంటూరు నగరాల చుట్టూ నిర్మిస్తున్న.. యాక్సెస్ కంట్రోల్డ్ అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణ ప్రాజెక్ట్‌లో కీలక ముందడుగు పడింది. దీని నిర్మాణానికి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏ ఐ) టెండర్లు ఆహ్వానించింది. ఈ ప్రాజెక్ట్‌కు కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య అప్రైజల్ కమిటీ (పీపీపీఏసీ) అనుమతి, ఆ తర్వాత కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) అనుమతి త్వరలో లభించనుండటంతో.. ఈలోపు టెండర్లు ప్రక్రియ చేపట్టారు. 189.93 కి.మీ. మేర ఆరు వరుసలతో కూడిన ఓఆర్ఆర్, నారాకోడూరు నుంచి గుంటూరు శివారు బుడంపాడు వరకు నాలుగు వరుసలతో 5.2 కి.మీ. మేర నిర్మించే అనుసంధాన రహదారి (స్పర్ రోడ్) కలిపి మొత్తం 195.13 కి.మీ. నిర్మాణానికి శుక్రవారం టెండర్లు ఆహ్వానించారు. ఈ ప్రాజెక్టును నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. సివిల్ పనుల అంచనా వ్యయంగా నాలుగు ప్యాకేజీల్లో కలిపి రూ.11,537 కోట్లుగా పేర్కొన్నారు. శుక్రవారం నుంచే టెండర్ల డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. నవంబరు 18 ఉదయం 11 గంటల వరకు వరకు బిడ్లు దాఖలుకి అవకాశం కల్పించారు. నవంబరు 19న టెండర్లు తెరవనున్నారు.

# అనంత్ అంబానీకి చంద్రబాబు ఆత్మీయ ఆలింగనం

- గ్లోబల్ హార్టికల్చర్ హబ్ వేదికగా ప్రత్యేక దృశ్యం
- ఆంధ్రప్రదేశ్‌తో అనుబంధం గుర్తుచేసుకున్న అనంత్
- మదనపల్లె సభలో ఆకట్టుకున్న వ్యాఖ్యలు





**మదనపల్లె, రాజధాని వాయిస్ :** అన్నమయ్య జిల్లా మదనప ల్లెలో నిర్వహించిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన కార్యక్ర మంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ మధ్య జరిగిన ఆత్మీయ సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ప్రసంగించిన అనంత్ అంబానీని ముఖ్యమంత్రి స్వయంగా అభినం దించి ఆలింగనం చేసుకోవడం సభలో పాల్గొన్న వారి దృష్టిని ఆకర్షించింది. ఈ దృశ్యం కార్యక్రమంలో విశేష చర్చనీయాంశమై ంది. సభలో మాట్లాడిన అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం తనకు గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నా రు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రేమాభిమానాలు తనకు ఎప్పటికీ ప్రత్యేకమని తెలిపారు. రాష్ట్ర ప్రగతికి తాను చేయగల సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. తనను ఆంధ్రప్రదేశ్ బిడ్డగా భావించాలని అనంత్ అంబానీ కోరడం సభలో ప్రత్యేక స్పందనకు కారణమైంది. రాష్ట్ర అభివృద్ధికి తాను ఏ విధంగా తోడ్పడాలో మార్గనిర్దేశం చేయాలని ముఖ్యమంత్రిని కోరా రు. వ్యవసాయం, ఉద్యాన రంగాలు, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులు, సాంకేతిక సహకారం అందించేందుకు ఆసక్తి ఉన్నట్లు ఆయన సంకేతాలు ఇచ్చారు. ఈ వ్యాఖ్యలకు సభికుల నుంచి చప్పట్లతో స్వాగతం లభించింది. అనంత్ అంబానీ ప్రసంగం ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన వద్దకు వెళ్లి అభినందించారు. అనంతరం ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధిలో పారిశ్రామిక వేత్తల భాగస్వామ్యం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నట్లు సమాచారం. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు

ఈ సంఘటనను ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ తదితరులు హాజరయ్యారు. అనంత్ అంబానీ ప్రసంగం అనంతరం వారు కూడా ఆయనను అభినందించారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ప్రాజెక్టులు రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధికి కీలక మైలురాళ్లుగా నిలుస్తాయని వారు అభిప్రాయపడ్డారు. రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల్లో ముఖ్యమైనదిగా భావిస్తున్నారు. వ్యవసాయం, ఉద్యాన పంటలు, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ రంగాల్లో కొత్త అవకాశాలు సృష్టించే దిశగా ఈ ప్రాజెక్టులు ఉపయోగపడనున్నాయి. ఈ నేపథ్యంలో మదనపల్లె వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో అనంత్ అంబానీ చేసిన వ్యాఖ్యలు, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందన ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# సుదీర్ఘకాలం పరారీలో నిందితుడు అరెస్టు

**అనకాపల్లి, రాజధాని వాయిస్ :** సుదీర్ఘకాలంగా న్యాయస్థానం జారీ చేసిన అరెస్టు వారెంట్‌ను తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని అనకాపల్లి టౌన్ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, టౌన్ స్టేషన్ అధికారి ప్రేమ్ కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక చర్యలు చేపట్టి నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పాత కేసులో నిందితుడిగా ఉన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓం ప్రకాశ్ యాదవ్ అలియాస్ ప్రకాష్ యాదవ్‌పై 2011లో అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా న్యాయస్థానానికి హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, పలుమార్లు కోర్టు విచారణలకు గైర్హాజరై చాలా కాలంగా పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. నిందితుడు కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో అనకాపల్లిలోని పదో అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం అతనిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ వారెంట్ అమలు కోసం పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిందితుడి కదలికలపై సమాచారం సేకరించారు. దర్యాప్తులో భాగంగా కానిస్టేబుళ్లు టి.ఎస్. నాయుడు, జగ్గారావు పలు ప్రాంతాల్లో గాలింపు చేపట్టి నిందితుడి ఆచూకీ కనుగొన్నారు. అనంతరం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అనంతరం నిందితుడిని న్యాయపరమైన ప్రక్రియల కోసం కోర్టులో హాజరుపరిచారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వారెంట్ అమలులో పోలీసుల కృషి ఫలించిందని అధికారులు తెలిపారు. కోర్టు ఆదేశాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, పరారీలో ఉన్న నిందితులను గుర్తించి చట్టం ముందు



నిలబెట్టేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగిస్తామని వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. న్యాయస్థానాల ఆదేశాల అమలులో అనకాపల్లి పోలీసులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా చట్టపరమైన చర్యలు కొనసాగిస్తామని అధికారులు పేర్కొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యానికి ప్రజల భాగస్వామ్యం

**అనకాపల్లి, రాజధాని వాయిస్ :** అనకాపల్లిలోని పెంటకోట ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర అవార్డుల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పాల్గొని వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన అవార్డు గ్రహీతలకు పురస్కారాలు అందజేశారు. పరిశుభ్రత, సామాజిక బాధ్యత, ప్రజా సేవలో ముందుండి పనిచేసిన వ్యక్తులు, సంస్థలను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన సత్యం, సేవ, పరిశుభ్రత మార్గాలు నేటికీ సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని, ప్రతి పౌరుడు తన బాధ్యతగా పరిశుభ్రతను పాటించాలని పిలుపునిచ్చారు. మన ఇల్లు మాత్రమే కాకుండా పరిసర ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని మంత్రి తెలిపారు. పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెరిగినప్పుడే స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం పూర్తిస్థాయిలో సాకారం అవుతుందని అన్నారు. గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజారోగ్యం మెరుగుపడటంతో పాటు అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మంత్రి పేర్కొన్నారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజా భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ దిశగా సేవలందిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు అవార్డుల ప్రదానం చేపట్టినట్లు చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధిపై కూడా మంత్రి ప్రస్తావించారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు చేరడం ఎంతో సంతోషకరమైన విషయమని



పేర్కొంటూ, సాగు, తాగునీటి అవసరాలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. నీటి వనరుల విస్తరణతో వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో అనకాపల్లి జిల్లా అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేస్తే జిల్లా పురోగతిలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, అవార్డు గ్రహీతలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# విదేశాలకూ సీమ వ్యవసాయ ఉత్పత్తులు

**మదనపల్లె, రాజధాని వాయిస్ :** రాయలసీమ పౌరుషమే ఇప్పటి వరకూ అందరికీ తెలుసని.. ఇకపై ఇక్కడి రైతుల సత్తా కూడా ప్రపంచం చూడబోతోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (జీహెచ్‌హెచ్), ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ) ద్వారా రాయలసీమ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం చంద్రబాబు హయాంలో స్థాపించిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలోనే మదనపల్లెలో ఏర్పాటు కానున్న ఐఎస్ఏ కూడా ప్రపంచస్థాయి సంస్థగా ఎదుగుతుందని తెలిపారు. దేశవిదేశాలకు కావాల్సిన పంటలను రాయలసీమలో పండించనున్నట్టు వెల్లడించారు.

**యువగళంలో డిక్లరేషన్ ప్రకటించా**

'వైకాపా ప్రభుత్వంలో నేను చేసిన యువగళం పాదయాత్రలో గొడ్డలి పార్టీ వారు నా మైక్ లాక్కున్నారు. బాటిళ్లు, కోడిగుడ్లు, రాళ్లు వేశారు. కానీ రాయలసీమ ప్రజల ఆశీస్సులతో 1,587 కి.మీ ఈ ప్రాంతంలో పాదయాత్ర చేశాను. రైతుల కష్టాలు చూశాను. రాయలసీమను ఉద్యానహబ్‌గా మార్చే బాధ్యత తీసుకుంటానని అప్పుడే చెప్పాను. కడపలో 'మిషన్ రాయలసీమ' పేరుతో డిక్లరేషన్ ఇచ్చాను. రైతుల ఆదాయం పెంచడమే దాని లక్ష్యం' అని లోకేశ్ పేర్కొన్నారు. 'త్యాగం, పోరాటానికి మదనపల్లె గడ్డ మరో పేరు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిన బీటీ కళాశాల విద్యార్థులు లాఠీదెబ్బలు తిన్నారు' అని మదనపల్లె ఘనతను లోకేశ్ కొనియాడారు. 'తెలుగు గంగ, ఎస్ఆర్‌బీసీ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, వెలిగొండ, పోలవరం ప్రాజెక్టులు మన ట్రేడ్ మార్కులు. వీటితోనే రాయలసీమ అరటి ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అవుతోంది. వీటితోనే కరవు ప్రాంతానికి కియా మోటర్స్ వచ్చింది. అందుకే చంద్రబాబును వాటర్ మ్యాన్ అంటున్నారు. నీటిని దేవుడిగా, సాగునీటి ప్రాజెక్టుల్ని దేవాలయాలుగా భావించే వ్యక్తి చంద్రబాబు. అప్పట్లో ప్రముఖ పారిశ్రామికవేత్తలంతా కలిసి ఒక బిజినెస్ స్కూల్ పెట్టాలనుకున్నారు. వారు ముంబయి, చెన్నై, బెంగళూరు నగరాలను పరిశీలిస్తున్న సంగతి తెలిసి, ధీరూబాయ్ అంబానీతో చంద్రబాబు మాట్లాడారు. వారిని ఒప్పించి, స్వయంగా చంద్రబాబే ప్రజంటేషన్ ఇవ్వడంతో హైదరాబాద్‌లో ఐఎస్‌బీ ఏర్పాటయ్యింది. అదే మ్యాజిక్ ఇప్పుడు సీమలో జరగనుంది' అని లోకేశ్ తెలిపారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ గురించి ముకేశ్ అంబానీని ముంబయిలో చంద్రబాబు కలిసి వివరించగా.. ఏపీలో పెట్టడానికి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు.

**నా తమ్ముడు అనంత్ ఇకపై ఏపీ బిడ్డ**

'అంబానీ కుటుంబంతో చంద్రబాబుది మూడు తరాల అనుబంధం. ధీరూభాయ్ అంబానీ మొదలు అనంత్ అంబానీ వరకూ ఆ కుటుంబంతో అనుబంధం కొనసాగుతోంది. నా తమ్ముడు అనంత్ అంబానీకి



చెబుతున్నా.. ఇకపై మీరు ఆంధ్రప్రదేశ్ బిడ్డ. మనం కలిసి పనిచేద్దాం' అని లోకేశ్ అన్నారు. రాబోయే మూడేళ్లలో రాయలసీమలో ప్రభుత్వం రూ.40,352 కోట్లు, ప్రైవేటు రంగం నుంచి రూ.60 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు శుక్రవారం మంత్రి లోకేశ్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలియజేసింది.

# బీసీలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు పొడిచారు: బొత్స



**అమరావతి, రాజధాని వాయిస్ :** ఏపీ ముఖ్య మంత్రి చంద్రబాబు బీసీలకు మరోసారి వెన్నుపో టు పొడిచారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ జీవో న్యాయపరంగా నిలవదని తెలిసినా, కేవలం రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని మండిపడ్డారు. "రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టంగా తీర్పు ఇచ్చింది. ఈ విషయం తెలిసి కూడా చంద్రబాబు బీసీలను మోసం చేసేందుకు ఈ జీవో ఇచ్చారు. ఇప్పుడు హైకోర్టు కొట్టేయడంతో సుప్రీంకోర్టుకు వెళతానని చెప్పడం బీసీలను మరోసారి మభ్యపెట్టడమే" అని బొత్స అన్నారు. ప్రభుత్వానికి బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను వైసీపీ అడ్డుకుంటోందని టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని బొత్స మండిపడ్డారు. వెన్నుపోటు పార్టీలో ఉన్న బీసీ నాయకులు ఇప్పటికైనా చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడానికి బీసీ రిజర్వేషన్ల అంశాన్ని సాకుగా చూపవద్దని హితవు పలికారు. బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు దక్కేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

# 'సర్'తో ఓటు పోయిందా..? ఆ రాష్ట్రాల్లో ఈసీ ప్రత్యేక డ్రైవ్..!

**రాజధాని వాయిస్** కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు సర్వే (సర్)తో పెద్దఎత్తున ఓట్లు గల్లంతయ్యాయంటూ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అటు విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ పరిణామాల వేళ ఈసీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఓటరు జాబితాలో పేరు కోల్పోయిన అర్హులైన ఓటర్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించింది. వీరితో పాటు కొత్త ఓటర్ల నమోదు కూడా చేపట్టనుంది. ఈ మేరకు సర్‌ప్రక్రియ పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ఎన్నికల అధికారులకు ఈసీ (జుజ) ఆదేశాలు జారీ చేసినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. "బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ ముగిసింది. ఈ ప్రక్రియ సమయంలో ఏ వ్యక్తి పేరు అయినా జాబితా నుంచి తొలగిపోయినా.. లేదంటే యువ ఓటర్లు తమ ఓటుహక్కు పొందాలన్నా.. నిరంతర అప్‌డేషన్ ప్రక్రియ ద్వారా తమ పేర్లను ఎన్నికల జాబితాలో నమోదు చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇలాంటి ఓటర్ల నమోదు కోసం ఆయా రాష్ట్రాల ఎన్నికల అధికారులు తక్షణమే ప్రత్యేక డ్రైవ్ చేపడతారు" అని ఈసీ తమ మీడియా ప్రకటనలో వెల్లడించింది. ఫారమ్-6 ఉపయోగించి అర్హత కలిగిన ఓటర్లు తమ పేర్లను ఎన్నికల జాబితాలో నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఈసీ తెలిపింది. ఈ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించినట్లు పేర్కొంది. సర్‌కు ముందున్న ఓటర్ల



జాబితాతో ప్రస్తుత జాబితాను సరిపోల్చాలని ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది. ఎవరి పేర్లను తొలగించారన్న లిస్ట్ సిద్ధం చేసి.. అందులో అర్హత కలిగిన ఓటర్లు ఎవరైనా ఉన్నారో లేదో గుర్తించాలని తెలిపింది. వారి చేత ఫారమ్-6ను పూర్తి చేయించాలని ఈసీ ఆదేశించినట్లు సంబంధిత అధికారిక వర్గాలు వెల్లడించాయి. సర్ ప్రక్రియతో దాదాపు 13 కోట్ల మంది పేర్లను ఓటరు ముసాయిదా జాబితా నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. దీనిపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఈసీ ఓట్లను తొలగిస్తోందని విపక్షాలు మండిపడ్డాయి. ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది.

# గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల చెత్త వదిలింది: మంత్రి నారాయణ




**నెల్లూరు, రాజధాని వాయిస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ భారత్ - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి ప్రజలందరి సహకారం అవసరమని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఈరోజు నెల్లూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రాంగణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామని ప్రకటించి, ఆధునిక క్రికెట్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి మంత్రి నారాయణ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను వెంటనే ప్రారంభించి మూడు దశల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. స్వచ్ఛాంధ్ర కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెలా ఒక రోజు కేటాయిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై మంత్రి నారాయణ తీవ్ర విమర్శలు చేశారు. "గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించింది. గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్తే, మేం వాటన్నింటినీ క్లియర్ చేస్తున్నాం" అని ఆరోపించారు. వైజాగ్, గుంటూరులో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. పట్టాల పేరుతో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, తమ ప్రభుత్వం పేదలకు శాశ్వత నివాస పత్రాలు అందిస్తోందని మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి తన అపార అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని ఆయన అన్నారు.

# విద్యార్థులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**రెండు నెలల్లోనే నెరవేరిన హామీ -- కోటప్పకొండ జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ**
**భారతి ట్రస్ట్ సీఎస్ఆర్ నిధుల ద్వారా నియోజకవర్గానికి 160 సైకిళ్లు మంజూరు**
**సోమవారం 9, 10వ తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం**

**నరసరావుపేట, రాజధాని వాయిస్ :** విద్యార్థుల సంక్షేమం, వారి విద్యాభివృద్ధే ధ్యేయంగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు విద్యార్థులకు ఇచ్చిన హామీని కేవలం రెండు నెలల వ్యవధిలోనే నెరవేర్చి తమ చిత్తశుద్ధిని చాటుకున్నారు.గత జులై 24వ తేదీన కోటప్పకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్' (PTM) సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి రోజూ ఎంతో దూరం నడిచి వస్తున్న పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తమ ప్రయాణ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లి, పాఠశాలకు చేరుకోవడానికి సైకిళ్లు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సమస్యపై వెంటనే స్పందించిన శాసనసభ్యులు, తప్పకుండా మీ అందరికీ సైకిళ్లు అందజేస్తానని ఆ రోజే వేదికపై భరోసా ఇచ్చారు. చదువుకునే విద్యార్థులంటే ఎంతో ఆదరణ చూపే అరవింద బాబు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే భారతి ట్రస్ట్‌ను సంప్రదించారు. ఎమ్మెల్యే గారి విజ్ఞప్తికి ట్రస్ట్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించి, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) నిధుల కింద నరసరావుపేట నియోజకవర్గానికి 160 సైకిళ్లను మంజూరు చేశారు. హామీ ఇచ్చిన రెండు నెలల స్వల్ప వ్యవధిలోనే ఈ సైకిళ్లు విద్యార్థుల చెంతకు చేరుకున్నాయి.



వాస్తవానికి గాంధీ జయంతి రోజే ఈ సైకిళ్లను విద్యార్థులకు అందజేయాలని భావించినప్పటికీ, ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఈ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించాలని నిర్ణయించారు. వచ్చే సోమవారం కోటప్పకొండ జడ్పీ హైస్కూల్ ఆవరణలో 9వ, 10వ తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థినీ విద్యార్థులకు శాసనసభ్యుల చేతుల మీదుగా ఈ సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. విద్యార్థుల చదువు కోసం అడగ్గానే సైకిళ్లు సమకూర్చిన ఎమ్మెల్యేకి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా భాగస్వామ్యంతోనే 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' సాధ్యం

**- కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు**

**నరసరావుపేట,రాజధాని వాయిస్** పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి పౌరుడి కర్తవ్యమని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్పష్టం చేశారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం నరసరావుపేటలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' లక్ష్య సాధన కోసం జిల్లాలోని 13 శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందికి అవసరమైన వాహనాలు, పరికరాలను ఇప్పటికే సమకూర్చామన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిలకలూరిపేట మున్సిపాలిటీ స్ఫూర్తితో జిల్లాలోని మిగతా విభాగాలు కూడా పనిచేయాలని సూచించారు. దేశంలోనే అత్యంత స్వచ్ఛ నగరమైన 'ఇండోర్' తరహాలో పల్నాడును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో చూడాలనుకునే మార్పు ప్రతి ఒక్కరి ఇంటి నుంచే మొదలవ్వాలని మహాత్ముడు చెప్పిన మాటలను గుర్తుచేస్తూ, సభికులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. నరసరావుపేటలో ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న 'సా సా' కార్యక్రమం ద్వారా ప్రజ



లు, ప్రజాప్రతినిధులు రోడ్లను శుభ్రం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అలాగే ప్లాస్టిక్ నిషేధంపై స్పందిస్తూ, దుకాణదారులను ఇబ్బంది పెట్టడం కంటే, ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలపైనే శాశ్వత నిషేధం విధించాలని, ఈ అంశాన్ని ఇప్పటికే అసెంబ్లీలో ప్రస్తావించానని గుర్తుచేశారు. మున్సిపల్, ఆరోగ్య శాఖల సిబ్బంది రోజూ కనీసం గంట సమయం కేటాయించి పనిచేస్తే గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా మారుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో విశేష సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులు, అధికారులకు 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, డిఆర్ఓ అద్దయ్య, ఆర్డీవో బాలకృష్ణ, నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన, డిపిఓ నాగేశ్వర్ నాయక్, చిలకలూరిపేట, సత్తెనపల్లి మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతే లక్ష్యం.. సేవే పరమావధి

**రావిపాడులో 'స్వచ్ఛ రథం' ప్రారంభించిన ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు**

**నరసరావుపేట రాజధాని వాయిస్** నరసరావుపేట మండలం రావిపాడు గ్రామంలో నిర్వహించిన గ్రామసభ మరియు 'స్వచ్ఛ రథం' ప్రారంభోత్సవ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని, "సేవా సంకల్ప్ అభియాన్"లో భాగంగా చేపట్టిన "సేవా మేరా యోగ్‌దాన్" కార్యక్రమంలో ఆయన స్వయంగా మొక్కలు నాటి మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాప్రతినిధిగా, నిస్వార్థ ప్రజాసేవలో 25 వసంతాలు పూర్తి చేసుకోవడం మనందరికీ గర్వకారణం. ఒక నాయకుడి జన్మదినాన్ని లేదా మైలురాయిని కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, ప్రజలకు ఉపయో గపడే 'సేవా సంకల్ప్ అభియాన్'గా నిర్వహించడం ఎంతో ఆదర్శనీయం. అందులో భాగంగానే ఈరోజు మన రావిపాడు గ్రామంలో 'సేవా మేరా యోగ్‌దాన్' పేరుతో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని, గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దే 'స్వచ్ఛ రథం'ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది.కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమర్థవంతమైన నాయకత్వంలో మన కూటమి ప్రభుత్వం గ్రామాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పర్యావరణ సమతుల్యత, ప్రజా ఆరోగ్యం ప్రధాన లక్ష్యాలుగా మేము ముందుకు సాగుతున్నాం. గ్రామాలను చెత్త రహితంగా మార్చేందుకు సరికొత్త ఆలోచనతో ఈ 'స్వచ్ఛ రథం'ను అందుబాటులోకి తెచ్చాం. ఇళ్లలో, పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని ఈ స్వచ్ఛ రథానికి అందిస్తే, దానికి బదులుగా ప్రజలకు ఉపయోగపడే నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రిని



అందజేస్తాం. వ్యర్థాల నుంచి సంపద సృష్టించడంతో పాటు మన గ్రామాన్ని రోగాల బారిన పడకుండా కాపాడుకోవడమే దీని ముఖ్య ఉద్దేశం. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాన్ని స్వచ్ఛ రావిపాడుగా మార్చాలి. అదేవిధంగా, కేవలం మొక్కలు నాటడమే కాదు, నాటిన ప్రతి మొక్కనూ కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఈ బాధ్యతను గ్రామ యువత, స్థానిక వాలంటీర్లు ఒక యజ్ఞంలా ముందుకు తీసుకెళ్లాలి. చెట్లు మన ప్రాణవాయువుకు, భావితరాల భవిష్యత్తుకు జీవనాధారాలు. కాబట్టి యువకులు, మహిళలు, విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఈ సామాజిక సేవలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలి. మన నరసరావుపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను ఆదర్శవంతమైన, స్వచ్ఛమైన పల్లెలుగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం ఎల్లవేళలా అవసరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్య నాయకులు, నియోజకవర్గ, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత

**- గుంటూరు కలెక్టర్ సాయికాంత్ వర్మ**





**గుంటూరు, రాజధాని వాయిస్ :** మహాత్మా గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛతను ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి సమష్టిగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ పేర్కొన్నారు.గాంధీ జయంతి సందర్భంగా జిల్లా స్థాయి స్వచ్ఛత అవార్డుల కార్యక్రమం కలెక్టరేట్ లోని శంకరన్ హాల్లో శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేసే దిశగా వివిధ సంస్కరణలు చేపడుతోందన్నారు. స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు లేదా పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, జిల్లా లోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సాధారణంగా స్వచ్ఛత అవార్డులు పట్టణ, గ్రామీణ పారిశుద్ధ్య విభాగాలకు మాత్రమే పరిమితమవుతాయని, అయితే ఈసారి అన్ని శాఖలు, ప్రభుత్వ కార్యాలయాలు, వైద్య ఆరోగ్య సంస్థలు, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశుద్ధ్య కార్మికులు, ప్రజల్లో ఆదర్శంగా పనిచేస్తున్న వారిని గుర్తించి సత్కరిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛత అనేది అందరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**గుంటూరు జిల్లాకు పలు అవార్డులు**

రాష్ట్రస్థాయి స్వచ్ఛత అవార్డుల్లో గుంటూరు జిల్లాకు చెందిన నాలుగు పట్టణ స్థానిక సంస్థలు---గుంటూరు, తెనాలి, మంగళగిరి--తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, పొన్నూరు--- అవార్డులు సాధించడం అభినందనీయమన్నారు. గుంటూరు నగరానికి స్వచ్ఛ వాయు కార్యక్రమంలో దేశవ్యాప్తంగా రెండో స్థానం లభించడం జిల్లాకు గర్వకారణమన్నారు.

రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ గ్రామ పంచాయతీగా నంబూరు, స్వచ్ఛ పాఠశాలగా నిడమర్రు, స్వచ్ఛ ఆసుపత్రిగా యూపీహెచ్‌సీ ఇందిరానగర్, స్వచ్ఛ పరిశ్రమగా దుగ్గిరాల కాంటినెంటల్ కాఫీ ఎంపికైనట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో 62 మందికి స్వచ్ఛత అవార్డులు లభించాయని పేర్కొన్నారు.

ఈ విజయాలు ఏ ఒక్కరి కృషి వల్ల సాధ్యమైనవి కావని, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు, ప్రజల సమష్టి కృషి ఫలితమేనని కలెక్టర్ తెలిపారు.

**ఇంటి నుంచే స్వచ్ఛతకు శ్రీకారం చుట్టాలి**

స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, పరిసరాలు, కార్యాలయం నుంచే ప్రారంభించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంటే సిబ్బందిలో సానుకూల ఆలోచనలు, మెరుగైన పని వాతావరణం ఏర్పడుతుందన్నారు.తమ కుటుంబ సభ్యులను సైతం ఎటువంటి సంకోచం లేకుండా కార్యాలయానికి తీసుకువచ్చి, "ఇది నేను పనిచేసే కార్యాలయం" అని గర్వంగా చూపించగలిగే స్థాయిలో ప్రతి ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. గుంటూరు జిల్లా ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించిందని, ఇది మరింత మెరుగైన పనితీరుకు స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలోనూ జిల్లాకు గుర్తింపు వచ్చేలా అందరూ సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ కోరారు.

**స్వచ్ఛత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత -- ఎమ్మెల్యే నజీర్**

స్వచ్ఛత అనేది కేవలం పారిశుద్ధ్య కార్మికుల బాధ్యత కాదని, ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా స్వీకరించాల్సిన అంశమని గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ అన్నారు. స్వచ్ఛతా అవార్డ్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచనలతో స్వచ్ఛతను ప్రజలందరి భాగస్వామ్యంతో ఉద్యమంగా ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. వ్యర్థాలను సంపదగా మార్చే విధానాలను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆదాయాన్ని కూడా సమకూర్చుకోవచ్చన్నారు. పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను నిబద్ధతతో నిర్వహిస్తున్నందున వారికి ప్రజలు సహకరించాలని, రోడ్లపై చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి .....ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్** మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. స్వచ్ఛతా అవార్డ్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ ఎంతో అంకితభావంతో అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం వారు చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు.బాధ్యతారాహిత్యంతోనే అనేక ప్రాంతాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నామని, ఈ విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయడం, తడి--పొడి చెత్తను వేరు చేయడం వంటి అలవాట్లను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.పరిశుభ్రతను చిన్ననాటి నుంచే పిల్లలకు అలవాటు చేయాలని, అప్పుడే భవిష్యత్ తరాల్లో స్వచ్ఛతపై బాధ్యతాయుతమైన భావన పెంపొందుతుందని అన్నారు. "ప్రతి ప్రదేశం మనదే" అనే భావనతో వ్యవహరించినప్పుడే మన పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచగలమని తెలిపారు.అవార్డులు కేవలం గుర్తింపు మాత్రమే కాకుండా మరింత మెరుగ్గా పనిచేయడానికి ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.పారిశుధ్యం ఒకసారి చేపట్టి ముగించే కార్యక్రమం కాదని, అది నిరంతర ప్రక్రియ అని అన్నారు. పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని కోరారు.ప్రతి పనిలో దైవత్వాన్ని చూసినప్పుడే ఆ పనిని అంకితభావంతో, పరిపూర్ణంగా నిర్వహించగలమని ఆయన అన్నారు. అదే విధంగా పారిశుధ్యాన్ని కూడా ఒక పవిత్రమైన సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎన్ ఎస్ కె.ఖాజావలి, మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కిషోర్, జడ్పీ సీఈవో జ్యోతి బసు , డిఆర్డిఏ పిడి విజయలక్ష్మి, బిజెపి జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాపూజీ చూపిన మార్గం నేటి యువతకు ఆదర్శం: గళ్ళా మాధవి

**గుంటూరు, రాజధాని వాయిస్ :** గాంధీజీ చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత మార్గం నేటి యువతకు ఆదర్శమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శనివారం గుంటూరు కొరిటిపాడు సెంటర్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఽ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, వల్లూరి జయ ప్రకాష్ నారాయణ మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, మహాత్మా గాంధీని కేవలం స్వాతంత్ర్య సమరయోధుడిగా మాత్రమే కాకుండా, తన జీవితాన్ని విలువలతో నింపుకున్న మహనీయుడిగా గుర్తు చేసుకోవాలని అన్నారు. గాంధీజీ జీవితం ఒక తెరిచిన పుస్తకమని, అందులోని సత్యం, అహింస, స్వచ్ఛత, క్రమశిక్షణ వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. అపారమైన ధైర్యసాహసాలు కలిగి ఉన్నప్పటికీ ఎక్కడా అహంకారానికి, ఆవేశానికి తావివ్వకుండా తన లక్ష్యాలను సాధించిన మహానేత గాంధీజీ అని పేర్కొన్నారు. అహింసా మార్గంలో నడుస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. చిన్న చిన్న విషయాలకే ఆవేశపూరితంగా స్పందించే ఈ కాలంలో గాంధీజీ ఆలోచనలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.సత్యమే జీవితానికి పునాది అని గాంధీజీ తన జీవితాంతం నిరూపించారని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా నిజాయితీని విడిచిపెట్టకుండా జీవించిన మహనీయుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. తన ఆత్మకథ »»My Experiments with Truth ద్వారా కూడా సత్యాన్వేషణ కోసం



చేసిన ప్రయాణాన్ని ప్రపంచానికి తెలియజేశారని పేర్కొన్నారు. స్వచ్ఛతకు గాంధీజీ అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని, పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి, అభివృద్ధికి పునాదిగా నిలుస్తాయని ఆయన విశ్వసించారని చెప్పారు. అదే స్ఫూర్తితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.అదే విధంగా మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి దేశభక్తి, నిరాడంబరత, నిజాయితీకి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. గాంధీజీ, శాస్త్రిజీ వంటి మహనీయుల ఆలోచనలు, విలువలు, నైతికతలు భావితరాలకు ఆదర్శమని, ప్రజా జీవితంలో ఉన్న ప్రతి నాయకుడు వారి స్ఫూర్తితో పనిచేయాలని అన్నారు.నేటి తరం ప్రజాప్రతినిధులు, యువ నాయకులు మహనీయుల ఆశయాలను ఆచరిస్తూ ముందుకు వెళితే దేశం, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావు, కూటమి నాయకులు, స్థానిక నాయకులు భద్రయ్య, మాజీ కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నవయువతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వార్షికోత్సవం, గాంధీ జయంతి వేడుకలు





**పిడుగురాళ్ల.అక్టోబర్ 02 రాజధాని వాయిస్:** సమాజానికి తమ వంతు సేవ చేయాలనే సంకల్పంతో నవయువతరం ఫౌండేషన్ 6వ వార్షికోత్సవం మరియు మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా గుంటూరు విజయ సాయి స్త్రీల సంతాన సాఫల్య కేంద్రం గైనకాలజిస్ట్ డాక్టర్ యమ్. పద్మజ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యంపై ఆన్‌లైన్ వెబినార్‌ను విజయవంతంగా నిర్వహించారు. అనంతరం పిడుగురాళ్లలోని జమున స్కూల్‌లో చదువుతున్న 200 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, వ్రాత సామాగ్రి, పండ్లు, స్నాక్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. రక్కు నాయక్ మాట్లాడుతూ, నవయువతరం ఫౌండేషన్ వారు సమాజ హితం కోసం అందిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చిగుళ్ల సుమలతతో పాటు కొత్త అరుణ, సాయి ప్రకాష్, గుండా సునీత, సైదారావు, ఆదిలక్ష్మి, అన్నపూర్ణ లక్ష్మి, షేక్ షఫీ, సిరాజ్, పవన్,కాత్యాయనీ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# సిఈసి రాజీనామా చేయాలని భారీ ర్యాలీ



**సత్తెనపల్లి. అక్టోబర్ 02, రాజధాని వాయిస్:** పట్టణంలో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పాల్గొని మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, సిఈసి జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, సీజీఐతో కూడిన కమిటీని పునరుద్ధరించాలని సర్ ప్రక్రియ నిలిపివేయాలని,సర్ లో తొలగించిన ఓటర్లను జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిపిఎం, కాంగ్రెస్, వామపక్షాల పార్టీల నాయకులు కార్యకర్తలు కలిసి ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



**రాజుపాలెం.అక్టోబర్ 02 రాజధాని వాయిస్:** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా రాజుపాలెం మండలం, గణపవరం,బలిజేపల్లి గ్రామపంచాయతీ నందు సంస్కరణల ఉత్సవ ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు ప్రత్యేక అధికారి ఎంపీడీవో శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ, మహాత్మా గాంధీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం సాద్యం అయ్యేల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుపుతున్నారని,ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని,ఇది ప్రతి ఒక్కరి బాద్యత అని,స్వచ్ఛ గ్రామం,స్వచ్ఛ సంకల్పం దిశగా అన్నీ మండలంలోని అన్నీ గ్రామాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని,మన పరిసరాలు పచ్చధనంగా ఉండేలా మొక్కలు నాటి పచ్చదనం పెంచాలన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హోరాహోరీ గా జరిగిన క్రికెట్ పోటీలలో వెల్దుర్తి వారియర్స్ విజయ భేరి..




**మాచర్ల. అక్టోబర్ 02 రాజధాని వాయిస్:** పట్టణంలో, మండవ మాచర్ల ప్రీమియం లీగ్ లో మూడవ రోజున తలపడిన వెల్దుర్తి వారియర్స్ మరియు నెహ్రూ నగర్ లయన్స్ మధ్య హోరాహోరీగా జరిగిన రసవత్త పోరులో, ఈ క్రికెట్ పోటీను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. అనంతరం శుక్రవారం జరిగిన కాసు బ్రహ్మానంద రెడ్డి కళాశాల క్రీడా మైదానంలో, వెల్దుర్తి వారియర్స్ విజయం డంకా మోగించగా. మొదటగా విజేతగా నిలిచిన వెల్దుర్తి వారియర్స్ కు మాజీ మున్సిపల్ చైర్మన్ మదర్ సాహెబ్,చేతుల మీదగా బహుమతిని ప్రధానం చేశారు.అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ,పలనాడు అనగా ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతం అలాంటి ప్రాంతాన్ని క్రీడల ద్వారా ప్రపంచానికే పరిచయం చేయాలనే తపన ఆశ ఆశయాన్ని మండవ మాచర్ల ప్రీమియం లీగ్ ద్వారా తెలియచేయాలనుకోవడం చాలా అభినందించదగిన విషయం. దానిలోభాగంగా నన్ను ప్రేమతో పిలిచి క్రీడాకారులకు బహుమతులను అందజేయించటం నాకు చాలా సంతోషంగా ఉందని,ఈ కార్యక్రమానికి అతిథిగా పిలిచిన మండవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మండవ రవికి, కృతజ్ఞతలు తెలియజేశారు . అనంతరం మండల మాచర్ల ప్రీమియం లీగ్ మండవ రవి మాట్లాడుతూ, క్రీడలను, ప్రోత్సాహపరిస్తే యువకులు పెడదారిన పట్టకుండా ఉంటారని మరియు క్రీడలు మానసిక సాంఘిక సామాజిక వికాసానికి ఎంతో తోడ్పడుతుందని అంతేకాకుండా మాచర్ల ప్రాంతంలో ఎంతోమంది నైపుణ్యత కలిగిన క్రీడాకారులు ఉన్నారు. ఈ క్రీడాకారులను ప్రపంచానికి పరిచయం చేసి మన దేశాన్ని గౌరపరచాలని ప్రఖ్యాతలను తెప్పించటమే నాకు చాలా సంతోషంగా ఉంటుంది అని వారు పేర్కొన్నారు.

# దేశ దిశను మార్చిన దిగ్గజ దార్శనికులు గాంధీ, శాస్త్రి

## ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



**మాచర్ల.అక్టోబర్ 02 రాజధాని వాయిస్ :** భారతదేశ దిశను మార్చిన దిగ్గజ దార్శనికులు మహాత్మగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కొనియాడారు. గాంధీజీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతుల సందర్భంగా శుక్రవారం స్థానిక పార్క్ సెంటర్ నందున్న గాంధీజీ విగ్రహం వద్ద ఇరువురికి జూలకంటి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వేచ్ఛను ప్రసాదించిన మహనియుల త్యాగాలను గుర్తించుకోవాలన్నారు. జై జవాన్. జై కిసాన్ నినాదంతో జాతిని జాగృతి చేసిన శాస్త్రి ఆలోచన నేటి తరాలకు స్పూర్తిదాయ మన్నారు. అనంతరం ప్రధాని నరేంద్రమోది 25 సంవత్సరాల పాటు ప్రజా సేవలో సేవలు అందిస్తున్న సందర్భంగా స్థానిక కోదండ రామాలయం వద్ద సేవా మేరా యోగ్ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా పాల్గొని, మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషన్ వేణుబా బు, పార్టీ నాయకులు కజ్జం సైదయ్య, యెనుముల కేశవరెడ్డి, కొమెర దుర్గారావు, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, బృంగా రమణారావు, బీజేపీ నాయకులు కాశీపతి, క్రాంతి కుమార్, సురేష్, మాచర్ల వాసు, చంటి తదితరులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వం పై న్యాయ అవగాహన సదస్సు



**క్రోసూరు.అక్టోబర్ 02,రాజధాని వాయిస్:** మండలంలోని బయ్యవరం గ్రామంలో సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు సీనియర్ సివిల్ జడ్జి వి విజయ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వంపై న్యాయ అవగాహన కార్యక్రమం పారా లీగర్ వాలంటీర్ కోట బాబురావు ఆద్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజీ మార్గమే రాజమార్గమని, మధ్యవర్తిత్వం ద్వారా వివిధ రకాల కేసులను, సమస్యలను పరిష్కరించడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని, మండల న్యాయ సేవాధికార కమిటీ ద్వారా ఉచిత న్యాయం అందించడం జరుగుతుందని, సామరస్యాపూర్వకంగా చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని,ఎస్సీ, ఎస్టీ,మహిళ లు,వృద్దులు,దివ్యాంగులు,ప్రత్యేక అవసరాలు మొదలైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుతుందన్నారు.

# ఐజేయు, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోర్కెల దినోత్సవం



**మాచర్ల.అక్టోబర్ 02 రాజధాని వాయిస్ :**గాంధీ జయంతిని పురస్కరించుకుని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ పిలుపుమేరకు శుక్రవారం ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) మెంబర్ మాగులూరి రాంబాబు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి విద్యాధరణి మురళి ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలో జర్నలిస్టుల కోర్కెల దినోత్సవం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ రోడ్ లోని మురళి కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి, జిందాబాద్ ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్, జిందాబాద్ ఏపీయుడబ్ల్యూజే,జర్నలిస్టుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి అంటూ పెద్ద ఎత్తున చేసిన నినాదాలతో మాచర్ల పట్టణం దద్దరిల్లింది. యూనియన్ జెండాలను, ప్లకార్డులను చేత పట్టుకుని పట్టణ ప్రధాన రహదారిలో చేసిన ర్యాలితో మాచర్ల మార్మోగింది. కార్యక్రమంలో భాగంగా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించి అనంతరం తహశీల్దార్ బందెల కిరణ్ కుమార్ కు డిమాండ్స్ పత్రాన్ని అందజేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహశీల్దార్ కిరణ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి విద్యాధరణి మురళి మాట్లాడుతూ, జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజున దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై పెండింగ్లో ఉన్న డిమాండ్స్ ను పరిష్కరించాలని కోరుతూ ఐజేయు ఇచ్చిన పిలుపుమేరకు అనుబంధమైన ఏపీయూడబ్ల్యూజే కూడా పాల్గొని జర్నలిస్టుల కోర్కెల దినోత్సవం నిర్వహించుకోవడం జరిగిందన్నారు. జర్నలిస్టుల న్యాయమైన కోర్కెల పరిష్కారానికి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులు మీడియా సంస్థల రక్షణ కోసం కేంద్రం ప్రత్యేక చట్టం తీసుకురావాలని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిజం నాలుగో స్తంభం అని కీర్తిస్తున్నప్పటికీ పత్రికలు, మీడియా సంస్థల జర్నలిస్టులు భౌతిక దాడులకు అక్రమ నిర్బంధాలకు గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ ఏపియుడబ్ల్యూజే రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యులు ఎంఎస్ నాగేశ్వర రావు మాట్లాడుతూ, వర్కింగ్ జర్నలిస్టుల చట్టబద్ధమైన హక్కులను పునరుద్ధరించాలని,వేతన చట్టం అమలు చేయాలని, యాజమాన్యాలు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఐజేయు మెంబర్ మాగులూరి రాంబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ,ఆత్మ రక్షణ కోసం, జర్నలిస్టులపై జరుగుతున్న భౌతిక దాడులు అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టాలను తీసుకురావాలని అన్నారు. ప్రస్తుతం జర్నలిజం, జర్నలిస్టుల పట్ల ప్రభుత్వాల తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు.హెల్త్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యాలు కొనసాగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు నివేశన స్థలాలను మంజూరు చేయాలని,ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవనానికి స్థలం కేటాయించి భవన నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు పఠాన్ జాన్ ఖాన్, పులుసు శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తమాసు శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షుడు ఇల్లూరి పుల్లా రెడ్డి,బాహాటం శేషగిరిరాజు, నియోజకవర్గమాజీ అధ్యక్షుడు బాలబోయిన పాపారావు, దాసరి రాధాకృష్ణ, దొంగరి వెంకటేశ్వర్లు, శంకర్, భాష,చెన్నారెడ్డి,మాచర్ల రాజా,మాచర్ల రత్నం,బంక నాగేశ్వరరావు, పుణ్యమూర్తి వెంకటేశ్వర్లు, వంకాయలపాటి రవి,కె.జాని భాష,యేసు బాబు, బూతుకూరి రామచంద్రారెడ్డి, గాజుల ముక్కంటి,తాటి విజయ్ బాబు,పరిమల విజయ్, గట్ల కోటిరెడ్డి,తవిటి శ్రీకాంత్, పోలేపల్లి ఆనంద్, కంభంపాటి ప్రేమ్ కుమార్, కంభంపాటి మోహన్ రావు,బుట్టి అక్కయ్య, బి.హనుమంతరావు,మాచర్ల విద్యాసాగర్,పొన్నల ప్రవీన్,సుంకర జోగయ్య,సంతవరపు లక్ష్మీనారాయణ, కోటయోహాన్, కర్పూరపు శ్రీనివాసరావు, షేక్ జానీ బాషా, పులిమెల మాణిక్యరావు,నోముల నర్సయ్య,నాగరాజు,నరేష్,ప్రమోద్,హుస్సేన్,శ్రీను,బీర్నీడి దాసు, పాగళ్ళ చంద్రశేఖర్, ఆరుమూళ్ళ జాను,కొంగర వెంకటేశ్వర్లు, రెంటచింతల మండల అధ్యక్షుడు పూజల వెంకటరామయ్య, కుందూరు అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంక్ బహూకరణ

## - ప్రజల ముఖంలో చిరునవ్వును నింపిన మండవ రవి





**దుర్గి.అక్టోబర్ 02 రాజధాని వాయిస్ :**మండలంలోని కంచరగుంట గ్రామంలో మండవ చారిటబుల్ ట్రస్ట్ అధినేత మండవ రవి పేద ప్రజల పడుతున్న ప్రధాన సమస్యగా గుర్తించి ముఖ్యంగా నీటి కష్టాలను గమనిచ్చి నాగార్జునసాగర్ పక్కనే ఉన్నప్పటికీ నీరు అందలేని పరిస్థితిని చూసి మాచర్ల నియోజకవర్గం లోని కొన్ని గ్రామాలను గుర్తించి అందులో భాగంగా దుర్గి మండలంలోని కంచరగుంట గ్రామానికి వాటర్ ట్యాంక్ ని అందచేసారు. అనంతరం మండవ రవి మాట్లాడుతూ,ఎన్నో ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించడం నాకు చాలా సంతోషంగా ఉందని, పరిముఖ్యంగా పేద ప్రజల ముఖంలో బాధను తొలగించి చిరునవ్వును నింపాలని ఎందుకనగా పలనాడు ప్రాంతంలో మాచర్ల నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతముగా ఉన్నది ఈ ప్రాంతానికి నా వంతుగా ఏదో సామాజిక సేవగా మండల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతో కొంత నియోజకవర్గ ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని నా తపన నా ఆశయం అని అంతేకాకుండా ఇంకా రానున్న రోజుల్లో చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సహాయ సహకారాలను ముందుకు తీసుకెళ్తానని ఆయన తెలియజేశారు.

# నేరాల నియంత్రణకు డ్రోన్ నిఘా



**బాపట్ల, రాజధాని వాయిస్ :** జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు మరింత ప్రాధాన్యత ఇస్తూ బాపట్ల జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నేరాలకు అవకాశమున్న ప్రాంతాలపై డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా నిర్వహిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ అనుమానాస్పద కదలికలను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. జిల్లాలో నేరాలు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. డ్రోన్ కెమెరాల సహాయంతో విస్తృత ప్రాంతాలను ఒకేసారి పరిశీలిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడుతోందని అధికారులు తెలిపారు.ఎస్పీ బి. ఉమామహేశ్వర్ సూచనల మేరకు పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలతో సమన్వయం చేసుకుంటూ నిఘాను మరింత బలోపేతం చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, చట్టవిరుద్ధ కార్యకలాపాలు, రాత్రివేళల్లో జరిగే కదలికల పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అవసరమైతే వెంటనే స్పందించేలా పోలీసు వ్యవస్థను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. డ్రోన్ నిఘా ద్వారా సేకరించే దృశ్యాలను విశ్లేషిస్తూ నేరాల నివారణకు వ్యూహాత్మక చర్యలు చేపడుతున్నారు. ప్రజలు కూడా అనుమానాస్పద అంశాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల సహకారం ఉంటే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని పోలీసులు పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగించడం ద్వారా నేరాలను ముందుగానే గుర్తించి నివారించే అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు. జిల్లాలో అన్ని కీలక ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. ఈ ప్రత్యేక నిఘా కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చోట అదనపు భద్రతా చర్యలు అమలు చేస్తున్నారు. నేరరహిత సమాజ నిర్మాణానికి పోలీసు శాఖ కట్టుబడి ఉందని అధికారులు స్పష్టం చేశారు. ప్రజల భద్రత కోసం ఇలాంటి ఆధునిక నిఘా వ్యవస్థలను మరింత విస్తృతంగా వినియోగించనున్నట్లు తెలిపారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com